క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో స్వయంభు వెలసిన లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టాన్ని పద్యనాటక రూపంలో ప్రదర్శించారు. పౌరాణిక నాటకాన్ని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తిలకించి, ప్రదర్శనలో పాల్గొన్న సభ్యులను సన్మానించారు. నాటకంలో శ్రీరాముడిగా మైత్రి, ఆంజనేయుడిగా శ్రీకళాజ్యోతి జాతీయ అవార్డు గ్రహీత రమేష్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణయ్య, యాదగిరిరావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నందిగామ: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌కు చెందిన వెంకటయ్య షాద్‌నగర్ నుంచి నందిగామకు ఎలాంటి రశీదులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తీసుకొని వెళ్తుండగా నందిగామ శివారులో పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ వెంకటయ్యతో పాటు, యజమాని సత్తయ్యను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు చెప్పారు. దీంతో వారికి రూ.4వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ రహ్మాన్ ఖాన్ తెలిపారు.

సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తత

ఇన్‌స్పెక్టర్ రామయ్య



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రామయ్య

నందిగామ: సైబర్ క్రైమ్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ రామయ్య సూచించారు. నందిగామ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం సైబర్ క్రైమ్, లోన్‌యాప్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని, ఇన్సూరెన్స్ కోసం ఫోన్ చేస్తున్నామని, లోన్ కావాలా అంటూ వస్తున్న ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలు ఎవ్వరికీ చెప్పవద్దని తెలిపారు. ఎవరిపైనైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100కు వెంటనే ఫోన్ చేయాలని వివరించారు. అదే విధంగా యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారవద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజంలో అందరికీ సమాన గౌరవం

కొందుర్గు: సమాజంలో నివసించే ప్రతిపౌరుడికి సమాన గౌరవం ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. పౌరహక్కుల దినం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ముట్పూర్ గ్రామపంచాయతీ చుక్కమెట్టు గ్రామంలో పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంకా కొన్ని గ్రామాల్లో కులాల పేరుతో దూరంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఈ విషయమై చుక్కమెట్టులో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కులాలకతీతంగా దేవాలయాల్లోకి వెళ్లవచ్చని, ఎవరైన అడ్డు చెపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ లాలయ్య, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఆర్‌ఐ మహేందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిని కొనసాగించండి



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన సర్పంచ్ రాఘవరెడ్డి, తదితరులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాకారం సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి, గ్రామస్తులతో కలిసి ఎంపీ రంజిత్‌రెడ్డిని ఆయనను నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్కెపల్లి, బాకారం రోడ్డు అర్ధంతరంగా నిలిచిపోయిందని ఎంపీకి తెలియజేశారు. ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బాకారం, ఎన్కెపల్లి రోడ్డు పనులు పరిశీలించి వెంటనే అధికారులతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డు పూర్తైతే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో బాకారం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి



సైన్స్ ఫెయిర్‌లో పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకుంటున్న ప్రిన్సిపల్

మొయినాబాద్‌రూరల్: సీవీ రామన్ ఎఫెక్ట్ ఫలితాన్ని అనుసరిస్తూ విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలో వినూత్న ప్రయోగాలను ప్రదర్శించడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామ సమీపంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మాన్‌సూన్, హెల్మెట్, రక్తనమూనాలు, కిరణజన్య సంయోగక్రియ, మూత్రపిండం డిసక్షన్ ఉపయోకరమైన బ్యాక్టీరియాలు వంటి మొత్తం 44 నమునాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సైన్స్ ప్రదర్శనశాలలో మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలు చందానగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, చిన్న మంగళారం ప్రధానోపాధ్యాయులు బాలరాజ్, కనకమామిడి ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, రెడ్డిపల్లి ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి విద్యార్థులతో పాటు పాల్గొని వారు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను తిలకించారు. కార్యక్రమంలో నిర్వహించినందుకు సంక్షేమ గురుకులాల డివిజన్ కోఆర్డినేటర్ శారదావెంకటేష్ అభినందించారు.

అలరించిన వైజ్ఞానిక ప్రదర్శనలు

షాద్‌నగర్‌టౌన్: సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వివిధ పాఠశాల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ సత్యసాయి ఉన్నత పాఠశాల, కృష్ణవేణి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని ఎలికట్ట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు అందరిని ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నాగలింగం, రఫత్ సుల్తానా, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా సైన్స్ దినోత్సవం

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలు సైన్స్‌పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను సదస్సులో ప్రదర్శించారు.

దర్గా అభివృద్ధి పనులకు సహకరించాలి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ప్రార్థనలు చేస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే

కొత్తూరు: రంజాన్ పండగ తర్వాత జేపీదర్గా ఆవరణలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు వ్యాపారులు, స్థానికులు అన్ని విధాలుగా సహకరించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోరారు. మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా ఆయన మంగళవారం దర్గా ఆవరణలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్, డైరెక్టర్ షఫిఉల్లా, సీఈఓ ఖాజా మొయినోద్దీన్, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేపీదర్గా మాస్టర్‌ప్లాన్ ప్రకారం దుకాణాలు, స్థలాలు కోల్పోయే వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. దర్గాను అభివృద్ధి చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. దర్గాను దర్శించుకునే భక్తుల కోసం అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కాటేజీలు, షాపింగ్ కాంప్లెక్స్, బస్టాండ్ పలు అభివృద్ధి కార్యక్రమాలు మాస్టర్‌ప్లాన్‌లో ఉన్నట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బాబాకు ఛదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరి, తహసీల్దార్ రాములు, వక్ఫ్‌బోర్డు అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

మున్సిపల్ చైర్మన్ నరేందర్



కంటి పరీక్షలు చేయించుకుంటున్న చైర్మన్ నరేందర్

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు శిబిరంలో చెర్మన్ నరేందర్, కౌన్సిలర్ లతా శ్రీ కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. నిరుపేదలకు అన్ని విధాలుగా అండగా ఉండేందుకు సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. చాలా మంది నిరుపేదలు కంటి సమస్యలతో బాధపడుతున్నారన్న విషయాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ పట్టణాలు, పల్లెల్లో కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి హైదరాబాద్‌లోని సరోజిని ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకన్న, డాక్టర్లు జయప్రకాష్, శ్వేత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, శ్రీశైలంగౌడ్, ఇంద్రజ, పుష్పలీల, వరలక్ష్మి, మాధవి, అశోక్, శివ, ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ మాలతి



మండపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు, అంబేద్కర్ సంఘం సభ్యులు

చేవెళ్ల: మండల ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి తన వంతు కృషి అందిస్తానని జెడ్పీటీసీ మర్పల్లి మాలతికృష్ణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో తన సొంత నిధులతో వినాయక మండపం పునఃనిర్మాణం పనులను మంగళవారం ఆమె అంబేద్కర్ సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేద్కర్ కాలనీ ప్రజలు వినాయక మండపం పునఃనిర్మాణం గురించి అడగడంతో సొంత నిధులు కేటాయిస్తానని చెప్పి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకు వచ్చి మండల అభివృద్ధిలో ముందుటానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నత్తి క్రిష్ణారెడ్డి, నాయకులు దండు సత్తి, సాయి, అంబేద్కర్ సంఘం సభ్యులు జంగయ్య, యాదయ్య, సత్యానందం, శ్రీనివాస్, యాదయ్య, కరుణాకర్, నరేశ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

పాఠశాల హెచ్‌ఎం రవి



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

షాద్‌నగర్: విద్యార్థులు చదువుల్లో రాణించాలని పాఠశాల హెచ్‌ఎం రవి అన్నారు. మండల పరిధిలోని విఠ్యాల ఉన్నత పాఠశాలలో మంగళవారం సీవీ రామన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, డ్రాయింగ్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రవి మాట్లాడుతూ.. భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి సాధించిన సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఆయన పరిశోధన ఫలితాన్ని ధ్రువీకరించిన రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని చెప్పారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, బుద్యానాయక్, మల్లయ్య, రవికాంత్, మల్లేష్ పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

నందిగామ: తనకు ప్రభుత్వం ఇచ్చిన లావుని భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పరిధిలోని నర్సప్పగూడకు చెందిన రైతు ఎర్ర శ్రీశైలం మంగళవారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు కాపీలను స్థానిక విలేకరులకు అందజేశాడు. గత కొన్నేళ్ల క్రితం తనకు ప్రభుత్వం చేగూరు రెవెన్యూ శివారులో సర్వే నెం.474లో 2 ఎకరాల లావుని భూమిని ఇచ్చిందని, నాటి నుంచి నేటి వరకు ఆ భూమిని సాగుచేసుకొని జీవనం కొనసాగిస్తున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో సర్వే నెం.470, 471, 472లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు మంగళవారం లావుని భూమిలోకి ప్రవేశించి చదును చేసి ఆక్రమించుకున్నారని వివరించారు. లావుని భూమిని ఆక్రమించుకున్న వారిపై తగు చర్యలు తీసుకొని భూమిని కాపాడాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును స్థానిక తహసీల్దార్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులకు సైతం ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం



ఆక్స్‌ఫర్డ్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కొందుర్గు: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు, సామూహిక నృత్య ప్రదర్శన పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. సమాజంలో విద్యకు ఉన్న గౌరవం, గురువు పాత్ర తదితర అంశాలపై వక్తలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో పునఃనిర్మిస్తున్న హనుమాన్ రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ నర్సింగ్‌రావు రూ.51 వేల విరాళం మంగళవారం అందజేశారు. దేవాలయం నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరివిగా విరాళాలు ఇవ్వాలని గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, జగన్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

ఎమ్మెల్యే కాలె యాదయ్య



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండలంలోని జనవాడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త యాదయ్య కరెంట్ షాక్‌తో ఇటీవల మృతి చెందాడు. అతని బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో బీఆర్‌ఎస్ ప్రమాద బీమా పథకం కింద వచ్చిన రెండు లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ శాంతికిషన్, నాయకులు ఒగ్గు మల్లేష్, ఒగ్గు అంజయ్య, ప్రవీణ్, కిషన్ సింగ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

గ్రామీణ క్రీడాకారులకు అవినాశ్‌రెడ్డి ఉద్బోధ



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత గ్రామీణస్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. దివంగత నేత స్వర్గీయ పట్నం రాజేందర్‌రెడ్డికి క్రీడలంటే ఎంతో ప్రాణమన్నారు. ఆయన స్ఫూర్తిగా తీసుకుని ప్రతి సంవత్సరం జిల్లాస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మార్చి 1వ తేదీన బహుమతులు, నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, స్టేడియం అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు జడల రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, శ్రీనివాసచార్యులు, ఆరిఫ్, అద్దు, నిర్వాహకులు మహేష్‌యాదవ్ వ్.రమేష్‌యాదవ్, ధనుంజయ్, మొయిస్ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



బయలుదేరుతున్న పంచాయతీ కార్మికులు

మొయినాబాద్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో జరుగుతున్న పంచాయతీ కార్మికుల పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి మంగళవారం మొయినాబాద్ నుంచి పంచాయతీ కార్మికులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంచాయతీ కార్మికుల వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. మల్టిపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని.. కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు ఉన్నారు.

జీవాలకు ‘నట్టల’ మందులు తప్పనిసరి

పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



మేకలకు మందులు వేస్తున్న పశువైద్య సిబ్బంది

షాబాద్: జీవాలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సోలీపేట్, ఎర్రవల్లి, దామర్లపల్లి, ఎల్గొండగూడ గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడుసార్లు నట్టల మందులను తప్పనిసరిగా తాపించాలన్నారు. జీవాలు ఆరోగ్యంగా ఎదిగేందుకు నట్టల నివారణ మందులు వేయించాలని చెప్పారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందని, అర్హులందరు వాటిని వినియోగించుకుని లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీగా వినయ్‌బాబును గెలిపించుకుందాం

రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు వి.సత్యనారాయణ



ప్రచార కరపత్రాన్ని అధ్యాపకులకు అందించి ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

మొయినాబాద్‌రూరల్: రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అరం వినయ్‌బాబును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు వి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి సమీపంలో గల బాలికల గురుకుల పాఠశాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొని ఉపాధ్యాయులతో సమావేశమై రాష్ట్రంలో ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాల గురించి తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రొఫెసర్ వినయ్‌బాబు ఎంతో కృషి చేస్తారని అనుభవం ఉన్న వ్యక్తిని ఎన్నుకుంటే మన సమస్యలు పరిష్కారమవుతాయని వినయ్‌బాబును ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వేలాది మంది ఉపాధ్యాయుల హక్కుల కోసం వినయ్‌బాబు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. గురుకులాల అధ్యాపకులకు దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై మంచి అవగాహన కలిగిన వ్యక్తిని అన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌శర్మ, చేవెళ్ల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, బంటారం ప్రిన్సిపాల్ ఉషారాణి, ప్రొఫెసర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల డుమ్మాపై గ్రామస్తుల ఆగ్రహం

టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న కుర్చీలు



ఆలూరు ఆస్పత్రి బయట కూర్చున్న గాయపడిన బాధితులు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక్కరంటే ఒక్కరు కూడా వైద్యులు, వైద్యసిబ్బంది లేకపోవడంతో రోగులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆలూరు బస్‌స్టేజీ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని గ్రామస్తులు ఆలూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో వారు తీవ్రంగా మండిపడ్డారు. ఆస్పత్రి ఉందని బస్‌స్టేజీ నుంచి గాయపడిన వారిని తీసుకొని వస్తే ఒక్కరు కూడా లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అయితే, ఆస్పత్రిలో ఉండాల్సిన వైద్యుడు హైదరాబాద్‌కు ట్రైనింగ్ వెళ్లాడని, అప్పటి వరకు విధుల్లో ఉన్న నర్సు శిరీషా తన డ్యూటీ అయిపోయిందని మరో నర్సు వచ్చే వరకు ఉండకుండానే వెళ్లిపోయింది. సమయానికి రావాల్సిన మరో నర్సు జ్యోతి ఆలస్యంగా రావడంతో గాయపడిన వారు వచ్చిన సమయంలో ఆస్పత్రిలో ఒక్కరు కూడా లేకుండా పోయారు. దీంతో కిందిస్థాయి సిబ్బంది మాత్రమే ఉండడంతో గ్రామస్తులు ఆస్పత్రి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఆస్పత్రి ఉండి కూడా లేనట్లుగానే ఉందని, ఎప్పుడు చూసిన వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఆలూరు గ్రామస్తులు అక్కడే ఉన్న కింది స్థాయి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలూరు ఆస్పత్రి తీరును మార్చాలని కోరారు. దీనిపై చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్‌ను వివరణ కోరగా ఆలూరు ఆస్పత్రి విషయం నా దృష్టికి వచ్చింది మరోసారి అలా జరగకుండా చేసుకుంటామని తెలిపారు.